# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 సంచిక :189 ప్రచురణ : హైదరాబాద్ గురువారం,21-05-2026 పేజీలు: 8 వెల : 3- 00


## పేదలకు ఉచిత వైద్యం తప్పనిసరి..

- ప్రైవేట్ ఆసుపత్రులకు సుప్రీంకోర్టు గట్టి హెచ్చరిక!
- సామాన్యులకు వైద్యం అందని ద్రాక్ష కావొద్దని గట్టిగా చెప్పిన న్యాయస్థానం..
- ప్రభుత్వ రాయితీలు, తక్కువ ధరల భూములపై నిర్మించిన ప్రైవేట్ ఆసుపత్రులు పేద రోగులకు ఉచిత సేవలు అందించాల్సిందేనని స్పష్టం
- గతంలో ఇచ్చిన తీర్పులను బేఖాతరు చేస్తున్న యాజమాన్యాలపై కోర్టు తీవ్ర అసహనం
- నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు





## నకిలీ సోషల్ మీడియా అకౌంట్స్‌పై ఉక్కుపాదం

- నీట్ పరీక్షకు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు
- కేంద్ర భద్రతా, నిఘా సంస్థలతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం
- పరీక్షను సురక్షితంగా, పటిష్టంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అప్రమత్తతను పెంచాలి
- పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి



## జలమండలిలో అవినీతి జలగలు!

- కుర్చీ వదలరు - అక్కడి నుంచి కదలరు
- హైదరాబాద్ జలమండలిలో అవినీతిపై మరోసారి తీవ్ర చర్చ
- జలమండలిలో ఏ పనికైనా కమీషన్లు
- ప్రాజెక్టుల విభాగంలో రూ.కోట్ల దందా
- జలమండలిలో సంవత్సరాలుగా కొనసాగుతున్న అవినీతి వ్యవస్థపై చర్చ




హైదరాబాద్

హైదరాబాద్ మహానగరానికి తాగునీటిని అందించే జలమండలిలో అవినీతి ఆరోపణలు మళ్లీ తీవ్ర చర్చకు దారితీశాయి. నల్లాల కనెక్షన్ల మంజూరు నుంచి భారీ ప్రాజెక్టుల నిర్మాణాల వరకు అక్రమాలు సాధారణ వ్యవహారంగా మారాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల జలమండలి ప్రాజెక్టుల విభాగం జనరల్ మేనేజర్ కుమార్ ఇంట్లో ఏసీబీ సోదాలు నిర్వహించి భారీ స్థిర, చరాస్తులను గుర్తించడం ఈ వ్యవహారాన్ని మరింత సంచలనంగా వివరాలు 2లో..



## ఆర్థిక తుపాను రాబోతుంది

- మహనీయుల విగ్రహాల ముందు తలలు వంచడం పెద్ద ఫ్యాషన్‌గా మారింది
- మహనీయులను స్మరించుకుంటున్నామే తప్ప, వారు నమ్మిన సిద్ధాంతాలను సరిగ్గా కాపాడుకోలేకపోతున్నామని రాహుల్ వ్యాఖ్య
- రాబోయే రోజుల్లో రైతులకు ఎరువులు కూడా దొరకని పరిస్థితి రానుంది
- రానున్న కొద్ది నెలల్లో ద్రవ్యోల్బణం ఎక్కడికి చేరుతుందో.. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పుధాన్యాలు, బియ్యం ధరలు ఎక్కడికి చేరుతాయో మీరే చూడండి

## అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఫ్యూచర్‌సిటీకి



- హెల్త్ క్లస్టర్ ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్యలు
- ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో పరిశ్రమల శాఖపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష
- ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై చర్చ
- అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఫ్యూచర్‌సిటీకి తీసుకురావాలని వెల్లడి

హైదరాబాద్

భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వచ్చే నెలలో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమలకు శంకుస్థాపనలు జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని, ఫ్యూచర్ సిటీలో 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని వివరాలు 2లో..

## సీఏఏ పరిధిలోకి రాని ప్రతి ఒక్కరూ చొరబాటుదారులే

- వారిని దేశం నుంచి పంపించేస్తాం : బెంగాల్ సీఎం
- సరిహద్దు కంచె కోసం బీఎస్ఎఫ్‌కు భూమిని అప్పగించిన బెంగాల్ సర్కార్
- గత ప్రభుత్వ ఓటు బ్యాంకు రాజకీయాల వల్ల భూమి బదిలీ నిలిచిపోయింది
- బెంగాల్ రాష్ట్రం బంగ్లాదేశ్‌తో సుమారు 2,200 కిలోమీటర్ల మేర అంతర్జాతీయ సరిహద్దును పంచుకుంటోంది



## హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ



- చెరో 50 శాతం చొప్పున ముందుకెళ్లేందుకు కేంద్రం సిద్ధం
- హైదరాబాద్ ప్రాజెక్టులపై కేంద్రమంత్రులు ఖట్టర్, కిషన్ రెడ్డి సమీక్ష
- హైదరాబాద్ మెట్రో విస్తరణ, మూసీ ప్రక్షాళనపై చర్చ
- మెట్రో విస్తరణకు సూత్రప్రాయ అంగీకారం
- కేంద్ర, రాష్ట్రాలు చెరో సగం ఖర్చుతో ముందుకెళ్లేందుకు సిద్ధం



## ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవద్దు

- అది ప్రజాతీర్పునకు వ్యతిరేకం
- టీవీకేకు సీపీఐ(ఎం) హెచ్చరిక
- తమిళనాట రసవత్తర రాజకీయాలు
- ఏఐఏడీఎంకే మద్దతు తీసుకోవద్దని టీవీకేకు సీపీఐ(ఎం) హెచ్చరిక
- అది ప్రజాతీర్పునకు విరుద్ధమని వ్యాఖ్య

## విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్‌బీఎం మినహాయింపు ఇవ్వండి

- నిర్మలమ్మకు భట్టి రిక్వెస్ట్
- రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్ర ఆర్థిక మంత్రితో భట్టి చర్చ
- ఎస్ఏఎస్‌సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి
- యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరణ



హైదరాబాద్

దిల్లీలో పర్యటిస్తున్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రితో చర్చించారు. ఆపై ఎస్ఏఎస్‌సీఐ కింద రాష్ట్రానికి అదనంగా రూ.5 వేల కోట్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాష్ట్రంలోని విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులను వివరించిన భట్టి విక్రమార్క, మానవ వనరుల అభివృద్ధికి రాష్ట్రం చేపట్టిన కార్యక్రమాల వివరాలను తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్స్ గురించి కేంద్రమంత్రికి వివరించిన వివరాలు 2లో..

# విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్ఆర్బీఎం మినహాయింపు ఇవ్వండి

-మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ సీఎం, ఆర్థిక వ్యవహారాల శాఖ ఆమోదిత ప్రాజెక్టులకు ఎఫ్ఆర్బీఎం పరిమితి మినహాయింపు కోరారు.

**కేంద్రానికి కృతజ్ఞతలు**

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన డిప్యూటీ సీఎం, తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగంలో భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలకు అదనపు ఆర్థిక సహాయం కోరారు. ఎస్ఏఎస్సీఐ కింద రూ.5,000 కోట్ల ప్రత్యేక సహాయం, విద్యారంగ పెట్టుబడులకు ఎఫ్?ఆర్?బీఎం మినహాయింపు ఇవ్వాలని విన్నవించారు. సాస్కీ కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకం ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి తెలంగాణ ప్రభుత్వం తరఫున ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

**సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు**

2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి ఇప్పటికే రూ.4, 208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు. నూతనంగా ఏర్పడిన రాష్ట్రాల్లో తెలంగాణ వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. అయినప్పటికీ 2014 నుంచి 2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్?వీపీ) ద్వారా తీసుకున్న అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని ఉప ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

**ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు**

అయినా విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో తెలంగాణ ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని ప్రస్తావించారు.



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్లు నిర్మలా సీతారామన్?కి తెలిపారు. జిల్లాల వారీగా కొత్త మెడికల్ కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వంతో కూడిన సుస్థిర అభివృద్ధికి దోహదపడతాయని కేంద్రమంత్రికి వివరించారు.

**విద్యారంగ రూపాంతరానికి రూ.30,000 కోట్లు**

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ రూపాంతరానికి మొత్తం రూ.30,000 కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని ప్రస్తావించారు. ఇందులో రూ.21,000 కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9,000 కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు ఆయన వివరించారు. ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి : కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డితో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. బొగ్గు గ్యాసిఫికేషన్ దిశగా సింగరేణి ముందడుగుకు కేంద్ర సహకారం కోరారు. కోల్ ఇండియా తరహాలో గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి చూపుతోందని తెలిపారు. గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి చూపుతోందని కిషన్‌రెడ్డికి భట్టి తెలిపారు. కొయ్యగూడెం బ్లాక్-3 కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్-2 మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు.

# అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఫ్యూచర్‌సిటీకి

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి ఆదేశించారు. హైదరాబాద్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ఫ్యూచర్ సిటీలో భూముల కేటాయింపు, పరిశ్రమల ఏర్పాటుపై మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. నెట్ జీరో సిటీ తరహాలో డిజైన్లు ఉండాలని రాజీపడవద్దని సీఎం స్పష్టం చేశారు. అంతర్జాతీయ స్థాయి నగరాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో అంతర్జాతీయ స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాతే భూములు కేటాయించాలని వెల్లడించారు. అంతర్జాతీయస్థాయి సంస్థలను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో ప్రజా ప్రతినిధులు, సివిల్ సర్వీసెస్ అధికారులు, జర్నలిస్టులకు 500 ఎకరాలు కేటాయించనున్నట్లు సీఎం ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన హెల్త్ క్లస్టర్ ఫ్యూచర్ సిటీ వచ్చేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ప్రధాని నరేంద్ర మోదీని కలిసి కోరుతామని తెలిపారు.

**ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలి**

జూన్‌లో ఫ్యూచర్ సిటీ ఇండస్ట్రియల్ పార్క్‌లో పరిశ్రమలకు శంకుస్థాపన జరిగేలా చూడాలని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భూములు కేటాయించిన వెంటనే నిర్మాణాలు మొదలు పెట్టాలనే నిబంధన విధించాలని తెలిపారు. పెట్టుబడుల ఆకర్షణ కోసం ఇన్వెస్ట్ తెలంగాణ పేరుతో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ఆకర్షణీయమైన లోగో, వెబ్ సైట్, ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని సీఎం చెప్పారు.

**1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు**

తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే వారి కోసం ఎస్కార్ట్ ఆఫీసర్ వ్యవస్థని రూపొందించాలన్న రేవంత్ రెడ్డి గ్రూప్-1 స్థాయి అధికారిని ఎస్కార్ట్ ఆఫీసర్‌గా నియమించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు. తమిళనాడు, గుజరాత్ పారిశ్రామిక విధానాన్ని అధ్యయనం చేయాలని అధికారులకు చెప్పారు. బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ ప్రారంభించాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో 1500 ఎకరాల్లో డేటా సిటీ ఏర్పాటు చేయాలని, నీటి అవసరాల కోసం ఎస్టీపీలను వినియోగించాలని సూచించారు. జీసీసీలు, డేటా సెంటర్ల కోసం కరీంనగర్, వరంగల్, విజయవాడ రహదారుల సమీపంలోని ప్రభుత్వ భూములు గుర్తించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ద్వితీయ శ్రేణి నగరాల్లో గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల ఏర్పాటు కోసం పాలసీ రూపొందించాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాలన్నీ 3 నెలల్లో టీ-ఫైబర్‌కు కనెక్ట్ కావాల్సిందేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ

హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణకు ముందడుగు పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు. మూసీ ప్రక్షాళనకు కేంద్రం సహకరిస్తుందని, అమృత్ 2.ా పథకం కింద రూ.3 వేల 975 కోట్లతో 39 ఎస్టీపీలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. దిల్లీలో జరిగిన సమావేశంలో హైదరాబాద్‌లో ప్రజా రవాణా, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల ప్రాజెక్టులపై సమీక్షించినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు.

**కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదు**

హైదరాబాద్ మెట్రో రైల్ విస్తరణ, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలపై దిల్లీలో కేంద్రమంత్రులు మనోహర్‌లాల్ ఖట్టర్, కిషన్‌రెడ్డి సమీక్షించారు. సమావేశ వివరాలను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సామాజిక మాధ్యమం ఎక్స్ ద్వారా వెల్లడించారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై సమావేశంలో చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్? అండ్ టీ సంస్థ నుంచి మెట్రో రైల్‌ను ఇటీవలే టేకోవర్ చేసుకుంది. ఈ నేపథ్యంలో రెండో దశ పనులకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్? (డీపీఆర్), ఇతర సాంకేతిక వివరాలు అందిన తర్వాత కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా పరిశీలించి తదుపరి నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎటువంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున ఖర్చు చేసే ప్రాతిపదికన ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 162 కిలోమీటర్ల మేర మెట్రో రెండో దశ విస్తరణకు ప్రతిపాదనలు సమర్పించిందని, సానుకూలంగా పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని మనోహర్‌లాల్ ఖట్టర్ వెల్లడించారు.

**కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో సహకారం**

హైదరాబాద్‌లో మూసీ ప్రక్షాళనపైనా సమావేశంలో చర్చించారు. అమృత్ 2.ా పథకంలో భాగంగా మూసీ నదిలో కలుస్తున్న మురుగు నీటిని శుద్ధి చేసేందుకు మొత్తం 39 సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లను (ఎస్టీపీ)లను మంజూరు చేశామని, ఈ ప్రాజెక్టు కోసం రూ.3 వేల 975 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ఖట్టర్ చెప్పారు. 39 ఎస్?టీపీల ద్వారా రోజుకు 972 మిలియన్ లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసే సామర్థ్యం వస్తుందన్నారు. శుద్ధి చేయని మురికి నీరు నేరుగా మూసీ నదిలో కలవకుండా ఎస్?టీపీలతో నిరోధించవచ్చన్నారు. మూసీ నది పరిరక్షణతో పాటు నగర పారిశుద్ధ్య మెరుగుదలకు ఇది ఎంతో దోహదం చేస్తుందని ఖట్టర్ తెలిపారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని అన్నారు. హైదరాబాద్ ప్రజల తరఫున కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఖట్టర్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# జలమండలిలో అవినీతి జలగలు!

-మొదటిపేజీ తరువాయి

మార్చింది. ఈ ఘటనతో జలమండలిలో సంవత్సరాలుగా కొనసాగుతున్న అవినీతి వ్యవస్థపై మరోసారి చర్చ మొదలైంది.

**కుర్చీ వదలరు**

జల మండలిలో నిర్మాణాలు, అభివృద్ధి పనులన్నింటినీ పర్యవేక్షించే ప్రత్యేక ప్రాజెక్టుల విభాగం ఉంది. ఈ విభాగంలో ఒకసారి పోస్టింగ్ వచ్చిన అధికారులు పదవీ విరమణ వరకు అక్కడే కొనసాగడం సాధారణంగా మారిందని ఉద్యోగ వర్గాలు చెబుతున్నాయి. మేనేజర్‌గా చేరిన అధికారులు ఉన్నత పదవులకు ఎదిగినా, అదే విభాగంలో కొనసాగుతుండటం అనుమానాలకు తావిస్తోంది. ఒకేచోట చాలా కాలం పని చేయడం వల్ల వ్యవస్థలో పారదర్శకత తగ్గి, అవినీతికి అవకాశాలు పెరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**ప్రాజెక్టుల్లో అంచనాల పెంపు ఆరోపణలు**

జలమండలిలో ప్రతి సంవత్సరం రూ.వందల కోట్ల విలువైన నిర్మాణాలు, అభివృద్ధి పనులు జరుగుతుంటాయి. ఈ పనుల్లో అంచనాలను కృత్రిమంగా పెంచడం, అత్యవసర పనుల పేరిట ఒకే పనులను పలుమార్లు చూపించడం, పనులు చేయకుండానే బిల్లులు చెల్లించడం వంటి ఆరోపణలు చాలా కాలంగా వినిపిస్తున్నాయి. భారీ ప్రాజెక్టుల్లో పనుల నాణ్యత కంటే కాంట్రాక్టుల విలువపై ఎక్కువ దృష్టి పెడుతున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి. ఫలితంగా ప్రజా ధనం దుర్వినియోగమవుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఎస్టీపీ నిర్మాణాల్లో ప్రశ్నలు**

హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం మురుగు నీటి శుద్ధి




కేంద్రాలైన ఎస్టీపీల నిర్మాణం విస్తృతంగా కొనసాగుతోంది. ఈ పనులను పర్యవేక్షించే బాధ్యత ప్రాజెక్టుల విభాగంపై ఉంది. ఇటీవల ఏసీబీకి చిక్కిన జీఎం కుమార్ కూడా అనేక ఎస్టీపీ పనులను పర్యవేక్షించినట్లు సమాచారం. దీంతో ఈ నిర్మాణాల నిర్వహణ, ఖర్చుల అంచనాలు, కాంట్రాక్టుల కేటాయింపులపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


**ఓఅండ్ఎం విభాగంలోనూ అవినీతి ఆరోపణలు**

ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ విభాగంలో కూడా అవినీతి ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఇంటి నీటి కనెక్షన్ల నుంచి కమర్షియల్ కనెక్షన్ల వరకు డబ్బులు చెల్లించకపోతే పనులు ముందుకు కదలవని బాధితులు ఆరోపిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలకు అవసరమైన ఫీజుబిలిటీ ధ్రువపత్రాల కోసం భారీ మొత్తాలు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. డబ్బులు చెల్లించని దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

**పారదర్శకతపై పెరుగుతున్న ప్రశ్నలు :** జలమండలి వంటి ప్రజలకు అత్యవసర సేవలు అందించే సంస్థలో అవినీతి ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. నీటి సరఫరా వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టాలంటే పారదర్శకత, అధికారుల బదిలీ విధానంలో మార్పులు, కఠిన పర్యవేక్షణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు. తాజా ఏసీబీ దాడులతో మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయా అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది.

# అమెరికాలో కిలో మామిడి రూ.1900

**హైదరాబాద్ :** మధ్య ఆసియా ప్రాంతంలో యుద్ధం కారణంగా భారత్ పై ప్రభావం పడుతోంది. ఈ తరుణంలో డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ పడిపోతుంది. దీంతో అమెరికాలోని కొన్ని వస్తువుల సేవలు భారతీయులకు ప్రియంగా మారాయి. కానీ ఈ సమయంలో భారత జాతీయ పండు అమెరికాలో సంచనలం సృష్టిస్తోంది. అక్కడివారు మామిడి పండ్లకు పడిపోయి ఎగబడి కొంటున్నారు. దీంతో భారత్ లోని మామిడి పండ్లు అమెరికాలో కిలో రూ. 1900 తో విక్రయిస్తున్నారు. హైదరాబాద్ లో కిలో మామిడికి రూ. 100 నుంచి రూ.200 ఉండగా.. అమెరికాలో డిమాండ్ ఎందుకు పెరిగింది? పూర్తి వివరాలు మీకోసం..భారతీయుల భావోద్వేగాలతో ముడిపడి ఉన్న మామిడి పండ్లు ఇప్పుడు అమెరికా మార్కెట్‌లో కొత్త చరిత్ర సృష్టిస్తున్నాయి. ఒకప్పుడు అమెరికాలోని కొన్ని భారతీయ కిరాణా దుకాణాల్లో మాత్రమే కనిపించిన భారత మామిడిపండ్లు, ఇప్పుడు ప్రపంచ ప్రఖ్యాత రిటైల్ చైన్ స్టోర్లలో కూడా అందుబాటులోకి రావడం విశేషం. ముఖ్యంగా అమెరికాలో అతిపెద్ద హోల్‌సేల్ రిటైల్ సంస్థలలో ఒకటైన కాస్టోకు స్టోర్లలో భారత మామిడిపండ్లు విక్రయించడం భారత వ్యవసాయ రంగానికి పెద్ద గుర్తింపుగా భావిస్తున్నారు.అమెరికా మార్కెట్‌లో భారత మామిడిపండ్లకు పెరుగుతున్న డిమాండ్ చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. ముఖ్యంగా గుజరాత్‌కు చెందిన ప్రసిద్ధ కేసర్ మామిడిపండ్లు అక్కడ భారీ ధరలకు అమ్ముడవుతున్నాయి. కాస్ట్‌కో వెబ్‌సైట్‌లో ఒక కిలో కేసర్ మామిడి ధర సుమారు 20 డాలర్లుగా నమోదైంది. అంటే భారత కరెన్సీ ప్రకారం దాదాపు రూ.1,900కు పైగా అవుతుంది. భారత్‌లో సాధారణంగా రూ. 100 నుంచి రూ. 200 వరకు అందుబాటులో ఉండే మామిడి పండ్లు విదేశాల్లో విలాసవంతమైన ఫలాలుగా మారిపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ఈ విజయానికి వెనుక భారత దౌత్యపరమైన ప్రయత్నాలు కూడా కీలక పాత్ర పోషించాయి. అమెరికాలోని సియాటిల్‌లో భారత కాన్సుల్ జనరల్‌గా పనిచేస్తున్న ప్రకాష్ గుప్తా భారత మామిడిపండ్లను ప్రధాన అమెరికన్ రిటైల్ మార్కెట్లలో ప్రవేశపెట్టేందుకు ప్రత్యేక కృషి చేసినట్లు వెల్లడించారు. ఆయన దీనిని 'మామిడి దౌత్యం'గా అభివర్ణించడం ఆసక్తికరంగా మారింది. భారతీయ ఉత్పత్తులకు అమెరికన్వినియోగదారుల్లో విశ్వాసం పెంచేందుకు ఏడాది కాలంగా నిరంతర ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు.భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద మామిడి ఉత్పత్తిదారుగా కొనసాగుతోంది. ప్రపంచ మొత్తం మామిడి ఉత్పత్తిలో దాదాపు 45 నుంచి 50 శాతం వరకు భారత్ నుంచే వస్తుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. మహారాష్ట్రలో పండే అల్ఫోన్సో, గుజరాత్



కేసర్, ఆంధ్రప్రదేశ్ బంగినపల్లి, ఉత్తరప్రదేశ్ దసరి, లంగ్రా వంటి రకాల మామిడిపండ్లు అంతర్జాతీయ మార్కెట్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాయి. రుచి, సువాసన, తీపి కారణంగా భారత మామిడి పండ్లకు విదేశాల్లో భారీ ఆదరణ లభిస్తోంది.అమెరికాకు మామిడిపండ్ల ఎగుమతి అంత సులభమైన ప్రక్రియ కాదు. అక్కడి ఆహార భద్రతా ప్రమాణాలు చాలా కఠినంగా ఉంటాయి. పండ్లను ప్రత్యేక హాట్ వాటర్ ట్రీట్‌మెంట్, రేడియేషన్ ప్రాసెసింగ్ వంటి విధానాల ద్వారా శుద్ధి చేసిన తర్వాతే ఎగుమతికి అనుమతి ఇస్తారు. అలాగే పండ్లు చెడిపోకుండా కోల్డ్ చైన్ వ్యవస్థ ద్వారా వేగంగా రవాణా చేయాల్సి ఉంటుంది. ఈ మొత్తం ప్రక్రియ ఖర్చుతో కూడుకున్నదే అయినా, పెరుగుతున్న డిమాండ్ కారణంగా ఎగుమతిదారులు ముందుకు వస్తున్నారు.

# భద్రకాళి ఆలయాన్ని దర్శించుకున్న కంచి పీఠాధిపతులు



**వరంగల్ సిటీ బ్యూరో. న్యూస్ ఇండియా ప్రతినిధి (రవీందర్)**వరంగల్ భద్రకాళి ఆలయాన్ని బుధవారం దర్శించుకున్న కంచి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామివారు ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారిని ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి, ఈ.ఓ తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ మహామండపంలో భక్తులను ఉద్దేశ్శించి తమ అనుగ్రహ భాషణం తెలిపారు. అనంతరం భక్తులకు స్వామివారు ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు.

## జంట హత్య కేసులో కోర్టు సంచలన తీర్పు :

మేకల నాగరాజుకు రూ.5 వేల జరిమానా,ఉరిశిక్ష



**న్యూస్ ఇండియా :చెన్నారావుపేట :**వరంగల్ జిల్లా చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని 16చింతల్ తండాలో చోటుచేసుకున్న దారుణ ద్విహత్య కేసులో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది.భార్యాభర్తలను అత్యంత క్రూరంగా హత్య చేసి, ఇద్దరిని తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడికి ఉరిశిక్ష విధిస్తూ వరంగల్ అదనపు జిల్లా న్యాయమూర్తి జె.మైత్రేయి కఠిన తీర్పు ప్రకటించారు. బి.ఎన్.ఎస్ సెక్షన్లు 333, 103(1), 109, 351(3) మరియు ఆమ్స్ యాక్ట్ సెక్షన్ 25(1 ఏ) కింద నమోదైన ఈ కేసులో నిందితుడు మేకల నాగరాజు అలియాస్ బన్నీ దోషిగా తేలాడు. బి ఎన్ ఎస్ సెక్షన్ 103(1) కింద నేరం రుజువుకాగా, బి ఎన్ ఎస్ ఎస్ సెక్షన్ 238(2) ప్రకారం "మెడకు ఉరి వేసి మరణించే వరకు" ఉరిశిక్ష అమలు చేయాలని కోర్టు ఆదేశించింది. అదనంగా రూ.5 వేల జరిమానా కూడా విధించింది.ఈ ఘటనలో బానోత్ సుగుణ (45), ఆమె భర్త బానోత్ శ్రీను (50) ప్రాణాలు కోల్పోగా, బానోత్ దీపిక (21), బానోత్ మదన్ లాల్ (17) తీవ్ర గాయాలతో బయటపడ్డారు.బాధితులంతా (ఎస్టి)లంబాడి వర్గానికి చెందిన వారు.ఈ దారుణ ఘటనపై బానోత్ ఈరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.గూడూరు మండలం గుండెంగా గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.ఈ కేసులో మొదట చంద్ర మోహన్, సిఐ ఆఫ్ పోలీస్, ఎస్ బి వరంగల్ దర్యాప్తు చేపట్టగా, అనంతరం శ్రీనివాస్ సిఐ నెక్కొండ సర్కిల్ విచారణ కొనసాగించారు. ప్రస్తుతం చెన్నారావుపేట ఎస్సై గా రాజేష్ రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు.ప్రత్యేక అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బృందా దేవి సమర్థవంతమైన వాదనలు వినిపించడంతో కేసులో నిందితుడికి కఠిన శిక్ష పడినట్లు న్యాయవర్గాలు పేర్కొంటున్నాయి.

## నూతన ఎస్ఐ ను మర్యాదపూర్వకంగా కలిసిన బిఆర్ఎస్ నాయకులు

శాలువాతో సన్మానించి పూల మొక్కను అందించిన బిఆర్ఎస్ నాయకులు



**నర్సింహులపేట,న్యూస్ ఇండియా ప్రతినిధి (సాయి)**మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన భానోత్ వెంకన్నను బుధవారం మండల బిఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి శాలువాతో సన్మానించి పూల మొక్కను అందజేయడం జరిగింది. అనంతరం ఎస్సై బానోతు వెంకన్న మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు ప్రతి ఒక్కరు సహకరించాలని యువతను మంచి మార్గం తీసుకుపోవడంలో అందరి తోడ్పాటు అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల యూత్ అధ్యక్షుడు బండి రమేష్, టౌన్ ప్రెసిడెంట్ జగదీశ్వర్, మాజీ వార్డ్ మెంబర్ మదర్, బిఆర్ఎస్ నాయకులు కుదుర్ల నాగరాజు పాల్గొన్నారు.

# భద్రకాళి ఆలయాన్ని దర్శించుకున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ మాత్యులు



**వరంగల్ సిటీ బ్యూరో న్యూస్ ఇండియా ప్రతినిధి. (రవీందర్)**వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానమును ఈ రోజు ఉదయం తెలంగాణా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన మంత్రిని ఆలయ చైర్మన్ డా॥ బి. శివసుబ్రహ్మణ్యం, ధర్మకర్తలు శ్రీయుతులు గాదె శ్రవణ్ కుమార్ రెడ్డి, ఓరుగంటి పూర్ణచందర్, శ్రీమతి మయూరి రామేశ్వర్రావు, గాండ్ల స్రవంతి. నార్ల సుగుణ, బింగి సతీష్, జారతి వెంకటేశ్వర్లు పాలడుగుట ఆంజనేయులు, అనంతుల శ్రీనివాస్, తొగరు క్రాంతి, సిరివోలు శ్రీధర్ రావు మూగా శ్రీనివాసరావు, ఈఓ శ్రీమతి రామల సునీత, ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషులు పూర్ణకుంభం, మంగళవాద్యాలతో ఘనస్వాగతం పలికారు. ముందుగ ఆదిశంకరాచార్యులను, వల్లభ గణపతిని దర్శించిన అనంతరం ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహింజేశారు. పూజానంతరం ఆలయ మహామండపంలో ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషం అధ్వర్యనమున అర్చకులు మహదాశీర్వచనం నిర్వహించి అమ్మవారి శేషవస్త్రములు బహూకరించి ప్రసాదములు అందజేశారు.

అనంతరం కంచి పీఠాధిపతులు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ మహాస్వామివారు ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారిని ఆలయ చైర్మన్, ధర్మకర్తల మండలి, ఈ.ఓ తదితరులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి శ్రీ విజయేంద్ర సరస్వతీ స్వామివారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ మహామండపంలో భక్తులను ఉద్దేశ్శించి తమ అనుగ్రహ భాషణం తెలిపారు. అనంతరం భక్తులకు స్వామివారు ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో వందలాది భక్తులు పాల్గొన్నారు.

రామల సునీత కార్యనిర్వహణాధికారి/సహాయ కమీషనర్, శ్రీ భద్రకాళీ దేవస్థానం, వరంగల్

# కేపీహెచ్‌బీ కాలనీలో ఉచిత మెగా వైద్య శిబిరం

టీపీసీసీ డాక్టర్స్ సెల్, సరళ దేవి ఫౌండేషన్, గౌతమ్ న్యూరో కేర్ ఆధ్వర్యంలో నిర్వహణ





**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20 ( మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ టి నరేష్ )** కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద టీపీసీసీ డాక్టర్స్ సెల్, సరళ దేవి ఫౌండేషన్ మరియు గౌతమ్ న్యూరో కేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో వివిధ వైద్య విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు సేవలందించగా,ప్రత్యేక న్యూరోకేర్ కన్సల్టేషన్ సదుపాయం కూడా కల్పించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ మధ్యతరగతి కుటుంబాలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, ఉచిత మందులు అందించడం ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల పేద మరియు మధ్యతరగతి కాలనీల వరకు ఇటువంటి ఆరోగ్య శిబిరాలను విస్తరిస్తున్నట్లు వెల్లడించారు. టీపీసీసీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ ఉదయ్ గౌతమ్ మాట్లాడుతూ... కోవిడ్ మహమ్మారి అనంతరం రక్తనాళాల్లో బ్లడ్ క్లాట్స్ సమస్యలు పెరుగుతున్నాయని, యువతలో హార్ట్ స్ట్రోక్, బ్రెయిన్ స్ట్రోక్ కేసులు అధికమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించేందుకు వైద్యులు, మెడికల్ స్టూడెంట్స్ కలిసి అవసరమైన జాగ్రత్తలు, మందుల వినియోగంపై సూచనలు అందించినట్లు తెలిపారు. శిబిరంలో భాగంగా రక్త పరీక్షలు, నరాల పరీక్షలు, బాడీ కంపోసిషన్ అనాలిసిస్ వంటి పలు వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకున్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి.

తెలంగాణ విద్యార్థి జేఏసీ



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20 (మహబూబాబాద్ జిల్లా స్టాప్ రిపోర్టర్)** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన ఉద్యమంలో ముందుండి కొట్లాడిన తెలంగాణా ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ విద్యార్థి జేఏసీ ప్రతినిధులు రాయిశెట్టి ఉపేంధర్, పల్లె కుమార్, పంతం సురేంధర్,బంధు మహేందర్, వెల్తూరి మల్లేష్, ఎండీ అమీర్,వెలిశాల శ్యామ్ లు కోరారు.ఈరోజు తొర్రూరు పట్టణంలో స్థానిక గెస్ట్ హౌస్ వద్ద తెలంగాణ విద్యార్థి జేఏసీ ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈసందర్బంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమ కారులను గుర్తించేందుకు కేశవరావు నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు.తెలంగాణ కోసం తమ విలువైన చదువులను, జీవితాల్ని త్యాగం చేసి బైండోవర్లు , అక్రమ కేసులు సైతం లెక్కచేయకుండా జైళ్లలో వేసినా కొదమ సింహాల్లా కొట్లాడిన విద్యార్థి ఉద్యమ కారులు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు అయిన తరువాత పది ఏళ్ళు బిఆర్ఎస్ ప్రభుత్వ తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవడంలో విఫలమైంది అన్నారు ఉద్యమకారులు ఆదరణ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా విద్యార్థి ఉద్యమ కారులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమ కారులకు 250గజాల స్థలం,ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షల రూపాయల ఆర్థిక సాయం అందించాలని, నెలకు 25వేల ఫించన్, హెల్త్ కార్డులు, ఉద్యమ కారుల సంక్షేమం కోసం వెయ్యి కోట్ల రూపాయల తో ఉద్యమ కారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అర్హులైన విద్యార్థి ఉద్యమ కారులకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని,అమరులైన అమరవీరుల కుటుంబాలను అన్నివిధాల ఆదుకోవాలని కోరారు.

# ఆన్లైన్ మందులు విక్రయ వ్యవసను వెంటనే రదు చేయాలి!





**న్యూస్ ఇండియా ప్రతినిధి యాదగిరి కామారెడ్డి** పిట్లం:మందులపై ఆన్లైన్ వ్యవస్థను రద్దు చేయాలని కోరుతూ, పిట్లం మండల కేంద్రంలోని మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా మెడికల్ అసోసియేషన్ నాయకులు కుమ్మరి యాదగిరి అధ్యక్షులు మాట్లాడుతూ, మందులపై ఆన్లైన్ వ్యాపారాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని, మందులపై ఆన్లైన్ విధానాన్ని పెట్టడం వల్ల ఆర్థికంగా మెడికల్ షాపుల నిర్వాహకులు నష్టపోతున్నారని, ఈ విధానాన్ని తక్షణమే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఈ యొక్క ఆన్లైన్ మందులు విక్రయాన్ని రద్దుచేసి మెడికల్ షాపుల నిర్వాహకులను ఆదుకోవాలని ఆయన కోరారు. లేదంటే ఈ యొక్క ఉద్యమం దేశవ్యాప్తంగా ఉదృత్తంగా చేయడానికి ఆల్ ఇండియా మెడికల్ యూనియన్ సభ్యులు సిద్ధంగా ఉన్నారు అని అన్నారు

పిట్లం మండల అధ్యక్షులు నానోజి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ యొక్క బందుకు పలు సంఘాలు ఆర్.ఎం.పి.ఎం.పి వైద్యులు సహకరించి సంఘీభావం తెలిపినందుకు వారికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది

అనంతరం తహసిల్దార్ మహేందర్ కుమార్ కి వినతిపత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో పిట్లం మండల ఉపాధ్యక్షులు పడిగల ఆనంద్ కుమార్, రామ గౌడ్, రమణ గౌడ్, కృష్ణ, విక్రమ్, బద్రి, వెంకటరెడ్డి, సాయిలు, దుర్గ ప్రసాద్, బలరాం రెడ్డి, శేఖర్ రెడ్డి, కలీం, రాజు, అంజి, ప్రభాకర్ రెడ్డి, కిరణ్, రఘుపతి రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# గంగామాత దేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహణ

**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20 (మహబూబాబాద్ జిల్లా స్టాప్ రిపోర్టర్)**మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం గుర్తూరు గ్రామంలో గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగపుత్ర కులదేవత అయిన గంగామాత దేవి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామమంతా భక్తి శ్రద్ధలతో కళకళలాడగా మహిళలు జల బిందెలు, బోనాలతో ప్రత్యేక ఊరేగింపులో పాల్గొన్నారు. డప్పు సప్పుల మేళతాళాలు, శివసత్తుల విన్యాసాలు, భక్తుల మొక్కులు చెల్లింపులతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ఉత్సవాల సందర్భంగా భక్తులు గంగామాత దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి కుటుంబాల సుఖశాంతులు, గ్రామాభివృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. గ్రామ వీధులన్నీ భక్తులతో కిటకిటలాడగా సంప్రదాయ కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ కార్యక్రమంలో గంగపుత్ర సొసైటీ అధ్యక్షులు పిల్లి నాగరాజు, స్థానిక అధ్యక్షులు పిల్లి వెంకన్న, కార్యదర్శి సింగారం చందర్, అనువాస శీను, సింగారం శీను, పిల్లి శీను, మురళి, యాకన్న, ఉప్పన్న, చంద్రయ్య, రమేష్ తదితర గంగపుత్ర సంఘ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## సురవరం ప్రతాప్ రెడ్డి 130వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం: మాజీ మంత్రి నిరంజన్ రెడి



**వనపర్తి జిల్లా న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20** వనపర్తి : తెలంగాణ వైతాళికుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, వనపర్తి తొలి శాసనసభ్యులు సురవరం ప్రతాప్ రెడ్డి గారి 130వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు.

మంగళవారం వనపర్తిలో మీడియాతో మాట్లాడుతూ, గోల్కొండ పత్రిక స్థాపకులు, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత దళిత దండోరా స్థాపించి అణగారిన వర్గాలకు అండగా నిలిచిన మహనీయుడు సురవరం అని కొనియాడారు. సురవరం సేవలకు గుర్తుగా ఇప్పటికే ఆయన పేరిట గ్రంథాలయం, కాంస్య విగ్రహం ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.

జయంతి ఉత్సవాలకు ప్రముఖ రచయిత గన్నమరాజు గిరిజా మనోహర్ బాబు, శ్రీధర్ రావు దేశ్ పాండే, వి ప్రకాష్ గారు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. సాహితీవేత్తలు విద్యావేత్తలు ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు

ఈ కార్యక్రమంలో గట్టు యాదవ్, నందిమల్ల అశోక్, పలుస శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియకు రాజకీయ పార్టీల సహకారం అవసరం.

**బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలు వెంటనే సమర్పించాలి - జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20** ,స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) మ్యాపింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేయడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో ఎస్ఐఆర్ ప్రక్రియపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్ల జాబితాలను వెంటనే సమర్పించాలని సూచించారు. బీఎల్‌వోలు నిర్వహించే ఇంటింటి సర్వే కార్యక్రమాని కి రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని తెలిపారు. జూన్ 2026 నుండి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేస్తారని, ప్రతి ఓటరు ఇంటిని కనీసం ఒక్కసారైనా సందర్శించి అవసరమైతే మూడు సార్లు వరకు వెళ్లి ఫారాలు సేకరిస్తారని చెప్పారు.

ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ ప్రక్రియ జూన్ 26 నుండి ప్రారంభమై 24-07-2026 లోపు పూర్తవుతుందని తెలిపారు. అనంతరం 31-07-2026న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, 31-07-2026 నుండి 30-08-2026 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని చెప్పారు. 01-10-2026న తుది ఓటరు జాబితా ప్రచురణ ఉంటుందని తెలిపారు. చిరునామా మార్పులు, ఇతర సవరణల కోసం ఫారం-8 ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు.

ఓటర్లు తమ పేరు ఎస్ఐఆర్-2002 జాబితాలో ఉందో లేదో తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ లేదా ఈసీఐ ఓటర్స్ పోర్టల్‌లో "సెర్చ్ బై ఎలెక్టర్ డిటైల్స్" ద్వారా తెలుసుకోవచ్చున్నారు. ఆధార్ నంబర్ ఇవ్వడం పూర్తిగా ఐచ్ఛికమని స్పష్టం చేశారు. 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న వారు ఫారం-6 ద్వారా కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చని, 01 అక్టోబర్ 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకునే వారికీ అవకాశం ఉంటుందని తెలిపారు.

ఫారం నింపడంలో లేదా వివరాల ధృవీకరణలో సహాయం కోసం బీఎల్‌వోలు, 1950 హెల్ప్‌లైన్, ఈసీఐ ఓటర్స్ పోర్టల్ మరియు "బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌వో" సౌకర్యాలను వినియోగించుకోవచ్చని సూచించారు. విదేశాల్లో లేదా ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగం చేస్తున్న ఓటర్ల తరపున కుటుంబంలోని పెద్ద సభ్యుడు ఫారం నింపి బీఎల్‌వోకు సమర్పించవచ్చని తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రాముఖ్యత, ఫారాల నింపే విధానంపై రాజకీయ పార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పించారు.

ఈ సమావేశంలో ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, జిల్లా ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి రాంబాబు, భారతీయ జనతా పార్టీ ప్రతినిధి ప్రభాకర్ రెడ్డి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి దేవి ప్రసన్న, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధి కంచర్ల జమలయ్య, ఎన్నికల సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నమండవ గ్రామంలో నీటి పైపుల మరమ్మతు పనులు



**చింతకాని న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20 ప్రతినిధి.** చిన్నమండవ గ్రామంలో రెండు చోట్ల గేట్ వాల్వ్ ఫెయిల్ అవ్వడంతో వాటిని తొలగించి కొత్త గేట్ వాల్వ్ ఏర్పాటు చేయడం జరిగింది. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా సమస్యను వెంటనే పరిష్కరించే చర్యలు చేపట్టారు. గ్రామ ప్రజలకు నిరంతర నీటి సరఫరా అందేలా గ్రామ పంచాయతీ సిబ్బంది మరమ్మతు పనులను పూర్తి చేశారు.

ఈ మరమ్మతు పనులను గ్రామ సర్పంచ్ గా ప్రత్యక్షంగా పరిశీలించి, పనులు నాణ్యతగా మరియు వేగంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీటి సౌకర్యాలు మెరుగుపరచడమే లక్ష్యమని తెలిపారు.

# పాతూరు శివాలయంలో పేద బ్రాహ్మణులకు నిత్యావసర సరుకుల పంపిణీ

**ముఖ్య అతిథిగా పాల్గొన్న నరసరావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు**




**న్యూస్ ఇండియా** పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలోని స్థానిక పాతూరు శివాలయం ప్రాంగణంలో బుధవారం శ్రీ వాగ్దేవి పురోహిత సంఘం ఆధ్వర్యంలో పేద బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు లబ్ధిదారులకు బియ్యం, కందిపప్పు, నూనె, చక్కెర తదితర నిత్యావసర సరుకుల కిట్లను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవింద బాబు మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబాలను ఆదుకోవడానికి వాగ్దేవి స్మార్త పురోహిత సంఘం చేస్తున్న సేవలు అభినందనీయం అని అన్నారు. ప్రభుత్వం కూడా అన్ని వర్గాల సంక్షేమానికి కట్టుబడి ఉందని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణకు పురోహితుల పాత్ర కీలకమని, వారి కుటుంబాలకు అండగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. శ్రీ వాగ్దేవి స్మార్త పురోహిత సంఘం అధ్యక్షులు మాట్లాడుతూ.. ఆలయ ధర్మకర్తల సహకారంతో ప్రతి నెలా 100 పేద బ్రాహ్మణ కుటుంబాలను గుర్తించి సరుకులు అందజేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతల సహకారం మరువలేనిదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాతూరు శివాలయం ప్రధాన అర్చకులు, సంఘం కార్యవర్గ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భద్రాద్రి రాముడు ఆశీస్సులు ఆ తారక రాముడికి ఎల్లప్పుడూ ఉంటాయి..

**ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా టీం తారక్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20** ,భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డు, కిరణ్ ఫ్లెక్స్ ప్రింటింగ్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ 43వ జన్మదిన వేడుకలు టీం తారక్ భద్రాచలం అధ్యక్ష కార్యదర్శులు గరిమెళ్ళ సాయి కిరణ్, బాచినేని మణిదీప్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్ కటింగ్ నిర్వహించారు. అనంతరం నిరుపేద 20 కుటుంబాలకు 20 వేలు విలువచేసిన నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా కార్యదర్శి ఎస్.కె అజీమ్, టీం తారక్ గౌరవ సలహాదారులు విజ్జిగిరి రాజా కిరణ్ పాల్గొని మాట్లాడుతూ... భద్రాద్రి రాముడు ఆశీస్సులు ఆ తారక రాముడికి ఎల్లప్పుడూ ఉంటాయి. ఎటువంటి వృధా ఖర్చులు చేయకుండా ఎన్టీఆర్ అడుగుజాడల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నాం. మా అభిమాన నాయకుడు ఎన్టీఆర్ తప్పకుండా సీఎం అవుతాడు. మంగళవారం రిలీజ్ అయిన డ్రాగన్ టీజర్ ప్రపంచవ్యాప్తంగా ఆకట్టుకుంది. సినిమా కోసం అభిమానులందరం ఆసక్తిగా ఎదురు చూస్తున్నాం. రానున్న రోజుల్లో ఎన్టీఆర్ అభిమానులుగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని అనుకుంటున్నాం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాచినేని అనిల్, రజాక్,అడ్వకేట్ మోహన్ కృష్ణ , తీగల అరవింద్, హీరో షోరూం దుర్గ , ముక్కరభోయిన సత్య సాయి శ్రీనివాస్, రెడ్డిపాలెం కిరణ్, సిహెచ్ రాంబాబు టీం



తారక్ అభిమానులు పాల్గొన్నారు.

# ప్రజాప్రభుత్వంలోనే పేదలకు లబ్ది



**అర్హులైన ఆడబిడ్డలందరికీ ఇందిరమ్మ ఇళ్ళు**

**టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20** అర్హులైన ఆడబిడ్డలందరికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడం జరుగుతుందని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని హమాలీ కాలనీ గ్రామంలో దేవి - గబ్బర్ సింగ్ దంపతులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించిన డబ్బులతో నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పథకాలలో ఒకటి ఇందిరమ్మ ఇండ్లు అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలం ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్ల ద్వారా రూ.5 లక్షలు ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇండ్లు లేని నిరుపేదలు , అర్హులైన ప్రతి ఒక్కరూ పథకం ఉపయోగించుకోవాలని అన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ హయాంలోనే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందన్నారు. గత పది సంవత్సరాల నుంచి నిరుపేదలకు ఇవ్వకుండా బిఆర్ఎస్ నేతలు మోసం చేశారన్నారు. మరికొన్ని రోజుల్లో సీఎం రేవంత్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గార్లు అర్హులైన మరింత మందికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఓబీసీ పట్టణ అధ్యక్షులు జయప్రకాష్,ఓబీసీ జిల్లా సెక్రటరీ బొబ్బాల వెంకట్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దయ్యాల సమ్మయ్య,కోంపెల్లి వీరయ్య,రావు కిరణ్,బోడా రమేష్ నాయక్,అక్బర్ యువజన కాంగ్రెస్ నాయకులు సాయిచంద్ మరియు గ్రామ పెద్దలు

## పాల్వంచ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు.

**రోడ్డు ప్రమాదాలు సైబర్ నేరాల పై పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలకు నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20** ,జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పాల్వంచ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలు,సైబర్ నేరాలపై నిత్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలలో లోని ప్రజలకు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో పాల్వంచ సీఐ సతీష్ కుమార్,ఎస్సైలు



# రైతుల మెరుపు ధర్నా

**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20** బజార్హత్నూర్ మండల కేంద్రంలో రైతులు ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మొక్కజొన్న. కొనుగోలు చేసి వారం గడిచిన మొక్కజొన్న సంచులు 7000 బ్యాగులు ఇప్పటికీ కూడా అక్కడే వర్షానికి తడుస్తూ రైతుకు అరిగోసపెడుతున్న ప్రభుత్వం వెంటనే లారీలను పంపించి లోడింగ్ చేయాలని డిమాండ్ చేశారు

అలాగే జొన్న పంట ఎకరానికి 20 కుంటల వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి కొనుగోలు చేసిన జొన్న పంట పదిహేను వేల బ్యాగులు వెంటనే లారీలో లోడింగ్ చేయాలని అలాగే తడిసిన ధాన్యాన్ని కూడా ఎటువంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ లో డిప్యూటీ తాసిల్దార్ గారికి వినతి పత్రం అందించారు ఇట్టి కార్యక్రమంలో రైతులు దుబ్బుల చంద్రశేఖర్. దంగరి రాములు. ప్రభాకర్ తోకల రాజన్న అనుము సాయన్న అగ్గునందు ధనుంజయ్ ఫరీద్ ఖాన్ లక్కం శంకర్ సోం రామ్ రెడ్డి లక్కం శ్రీనివాస్ గంట చిన్నయ్య మారుతి తడక శ్రీనివాస్ దన్నగర్ పండరి సుది వినాయక్ తదితరులు పాల్గొన్నారు

## రైతు అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి పునాది -- ప్రతి రైతు కుటుంబంలో ఆనందం నింపడమే ప్రభుత్వ ధ్యేయం

**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రైతుల అభివృద్ధి, ప్రకృతి వ్యవసాయంపై అవగాహన, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై విస్తృతంగా చర్చించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రతి రైతు వేదికలో రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా రైతుల ఆర్థికాభివృద్ధి మరియు అధిక దిగుబడుల లక్ష్యంతో జీలుగులు, జనుములు విత్తనాలను ప్రభుత్వం 50% సబ్సిడీపై అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు.

వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడంలో ,నకిలీ విత్తనాలను కట్టడి చెయ్యటంలొ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని, రైతుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా లిూవీజ చైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు , మధిర ־ాణ విజయ్ చంద్ర నాగులవంచ ఉప సర్పంచ్ అంబటి శరత్ కుమార్ గారు, ־ూ మానస గారు,־ాజూ కళ్యాణి పాల్గొన్నారు. అలాగే పెద్ద సంఖ్యలో రైతులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాలికపై దాడి యత్నం.. నిందితుడిపై కేసు నమోదు

**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 20 (మహబూబాబాద్ జిల్లా స్టాప్ రిపోర్టర్)** మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని ఓ గ్రామంలో బాలికపై దాడి యత్నానికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 18వ తేదీన ఇంటి ముందు ఉన్న మామిడి చెట్టు నుంచి పండ్లు కింద పడటంతో వాటిని తీసుకురావడానికి వెళ్లిన బాలికను గ్రామానికి చెందిన పున్నం నరసయ్య అనే వ్యక్తి బలవంతంగా ఇంట్లోని ఒక గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తిస్తూ బలవంతం చేయడానికి ప్రయత్నించినట్లు ఆరోపణలు ఉన్నాయి.

బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నామని తొర్రూర్ ఎస్ఐ మహేందర్ రెడ్డి తెలిపారు.

ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

యుద్ధం మంటల్లో ప్రపంచం మాడిపోతుంటే, ఆ మంటల వెలుగులోనే కొందరు తమ సంపద లెక్కబెట్టుకుంటారు, ఇది చరిత్ర పాఠం. కానీ ఆ "కొందరు" అమెరికా అధ్యక్షుడే అయినప్పుడు, విషయం కేవలం దురాశ కాదు, ప్రజాస్వామ్యానికి పడిన గాయం! డొనాల్డ్ ట్రంప్ పేరిట జరిగిన స్టాక్ లావాదేవీల పత్రాలు ఇప్పుడు ప్రపంచం ముందుకొస్తున్నాయి. 2026 తొలి మూడు నెలల్లో ట్రంప్ పేరిట 3,642 వ్యక్తిగత లావాదేవీలు; ప్రతి మార్కెట్ రోజూ సగటున దాదాపు 58 ట్రేడ్లు. వీటి విలువ 22 కోట్లనుంచి 75 కోట్ల డాలర్ల వరకు. ఒక దేశాధినేత ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లపై సంతకాలు పెడుతూ, విదేశీ నేతలతో మాట్లాడుతూ, టారిఫ్‌లు మారుస్తూ, మధ్యలో రోజుకు 58సార్లు మార్కెట్‌లో దూకడం అన్నది సాధారణ "పెట్టుబడి నిర్వహణ" కాదు. ఒక వాల్‌స్ట్రీట్ నిపుణుడు దీన్ని ఒక వ్యక్తి ఖాతా కాదు, హెడ్జ్ ఫండ్ బ్యాలెన్స్ షీట్‌లా ఉందని చెప్పడంలోనే అసలు కథ ఉంది. విషాదమేమిటంటే.. ఇదంతా చట్టం కళ్లముందే, చట్టం దయతోనే జరుగుతోంది. మామూలు ప్రభుత్వ ఉద్యోగి తన విధానాలతో లాభపడే కంపెనీ షేరు తాకితే అది నేరం; కానీ అధ్యక్షుడికి ఈ ప్రయోజన వైరుధ్య చట్టాలనుంచి మినహాయింపు ఉంది, 2012నాటి స్టాక్ చట్టం బహిర్గతం చేయమనే అడుగుతుంది తప్ప నిషేధించదు. అంటే తప్పు చేసే అవకాశాన్ని చట్టమే తలుపు తెరిచి ఆహ్వానిస్తోంది. ట్రంప్ నిస్సిగ్గుగా లోపలికి నడిచారంతే!

అసలు కంపెనీల పేర్లు చదివితే ఇది యాదృచ్ఛికమని ఎవరూ అనలేరు. ట్రంప్ ఏ రంగంపై తన అధికారాన్ని ప్రయోగిస్తారో, సరిగ్గా అదేరంగంలో ఆయన పేరిట కొనుగోళ్లు పోగుపడ్డాయి. లాక్‌హీడ్ మార్టిన్, జనరల్ డైనమిక్స్, నార్త్‌రోప్ గ్రుమ్మన్, బోయింగ్‌వంటి రక్షణ సంస్థలు; ఎన్విడియా, పలంటీర్, ఒరాకిల్, మైక్రోసాఫ్ట్, యాపిల్‌వంటి టెక్ దిగ్గజాలు -అన్నీ ఒక్క గూటి కిందనే. ఎన్విడియా ఉదంతం దీనికి పరాకాష్ఠ. ఎన్విడియా అధునాతన చిప్‌లను చైనాకు విక్రయించడానికి ట్రంప్ ఆమోదం తెలిపిన కాలంలోనే ఆయన పేరిట దాదాపు 60 లక్షల డాలర్ల ఎన్విడియా షేర్లు కొనుగోలు జరిగింది. ఒక చేత్తో దేశ ఎగుమతి విధానాన్ని సడలించి, మరో చేత్తో ఆ నిర్ణయంతో లాభపడే కంపెనీ షేర్లు కొనడాన్ని ఏ నిఘంటువు "ఆకస్మికం" అని పిలుస్తుంది? ఇరాన్ యుద్ధవేళ జరిగిందైతే మరింత దారుణం. యుద్ధం త్వరలో ముగుస్తుందని ట్రంప్ బహిరంగంగా చెబుతూనే, ఆయన ఖాతా చమురు, రక్షణ, బంగారంలో మిలియన్ల కొద్దీ కొనుగోళ్లు చేసింది. ఇంకా ఘోరం -యుద్ధ ముగింపు సంకేతాలతో బ్రెంట్ క్రూడ్ 11 శాతం పడిపోయిన ఆ ఒక్క రోజే ఆయన ఖాతా ఎక్సాన్, షెవ్రాన్, ఫిలిప్స్ 66, లాక్‌హీడ్, జనరల్ డైనమిక్స్ వంటి (యుద్ధం సాగితే లాభపడే) సంస్థల షేర్లు కొంది. యుద్ధం ముగిసినా, సాగినా ఎవరో కుటుంబం గెలవాలని మార్కెట్ పందెం వేయడం దీని అర్థం. డెల్ నాటకమూ అదే తీరు: ఫిబ్రవరి 10న 10-50 లక్షల డాలర్ల డెల్ షేర్లు కొని, మూడు నెలల తర్వాత వైట్‌హౌస్ వేదికపై డెల్‌ను బహిరంగంగా పొగిడారు; అప్పటినుంచి డెల్ షేరు 96 శాతం ఎగిసింది. ఇవన్నీ చూపిస్తూ సంజాయిషీ అడిగితే వచ్చే వివరణలు మరింత నవ్వు తెప్పిస్తాయి. ఎందుకంటే అవి ఒకదానికొకటి కొట్టుకుంటాయి. తమ ఆస్తులన్నీ 'ష్వాబ్ 1000' వంటి విస్తృత సూచీల్లోనే ఉన్నాయని ఎరిక్ ట్రంప్ అంటే, ట్రంప్

## ట్రంప్.. స్టాక్ మార్కెట్ గేమ్!

సొంత పత్రాలే వేలాది వ్యక్తిగత ట్రేడ్లను బట్టబయలు చేస్తున్నాయి. వైట్‌హౌస్ ఆస్తులన్నీ పిల్లలు నడిపే ట్రస్ట్‌లో ఉన్నాయని చెబితే, ట్రంప్ సంస్థ థర్డ్ పార్టీలకే 'సంపూర్ణ అధికారం' ఉందని చెప్పడం ఈ అబద్ధాల గోపురంలోని పగుళ్లు. ఏ కథ నిజమో వారికే తెలియదు, ఎందుకంటే ఏదీ నిజం కాదు. బుష్ హయాంలో వైట్‌హౌస్ నైతిక సలహాదారు రిచర్డ్ పెయింటర్ ఈ ముసుగును చింపేశారు. "ఇతను రక్షణ మంత్రి అయితే ఇది నేరమయ్యేది; సాంకేతికంగా అధ్యక్షుడు చేయొచ్చు, కానీ ఇది మౌలికమైన నమ్మక ఉల్లంఘన" అన్నారు. చట్టం అనుమతించింది కాబట్టి నైతికమైపోదు. దొంగతనం చట్టబద్ధమైనంత మాత్రాన దానం కాదుగా.

ఈ కంపు మొత్తాన్నీ సుగంధంగా చిత్రించే పని ఇప్పుడు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నెత్తికెత్తుకున్నారు. మే 19న ఒక విలేకరి నిలదీస్తే.. "అధ్యక్షుడు ఓవల్ ఆఫీస్‌లో కంప్యూటర్ ముందుకూర్చుని తన రాబిన్‌హుడ్ ఖాతా ద్వారా షేర్లు కొంటూ అమ్ముతూ ఉండడు, ఇది అసంబద్ధం" అని కొట్టిపారేశారు. కానీ ఎవరూ ట్రంప్

## సంపాదకీయం

స్వయంగా మౌస్ క్లిక్ చేస్తున్నారని ఆరోపించడం లేదు. నిజమైన ప్రశ్న వేరు! తన నిర్ణయాలు ఏ రంగాన్ని ఎగరేస్తాయో, ఏది కూల్చుతాయో తెలిసిన మనిషి, ఆ రంగాల్లోనే తన పేరిట కోట్లాది డాలర్ల పందెం వేయడం సబబేనా? వాన్స్ సమాధానం ఇవ్వకుండా ప్రశ్నను "అసంబద్ధం" అని ముద్ర వేయడమే ఆ సమాధానం దాచిపెడుతోంది. ఇంకా హాస్యాస్పదమేమిటంటే.. కాంగ్రెస్ సభ్యుల స్టాక్ ట్రేడింగ్ నిషేధానికి తానూ, అధ్యక్షుడూ పెద్ద మద్దతుదారులమని వాన్స్ చెప్పడం. ట్రంప్‌పై ఇంతవరకు ఎలాంటి ఛార్జీలూ లేవు. నిరూపితమైన ఇన్‌సైడర్ ట్రేడింగ్ నేరమూ లేదు, నిజమే! కానీ నైతికత న్యాయస్థానంలో గెలవాల్సిన కేసు కాదు. అది ప్రజల నమ్మకంలో నిలబడాల్సిన పరీక్ష. ఆ పరీక్షలో ట్రంప్ ఘోరంగా విఫలమవుతున్నారు. నిజానికి -అతిపెద్ద ముప్పు ఈ లావాదేవీలు కాదు, ప్రజల్లో పేరుకుపోతున్న "ఎవరు చేస్తే ఏం, అందరూ ఇలాంటివాళ్లే" అన్న నిర్లిప్తత. ఆ నిర్లిప్తతే ఇలాంటి దోపిడీలకు అసలు రక్షణ కవచం. యుద్ధం చేయాలా, చిప్‌లు చైనాకు అమ్మాలా, టారిఫ్‌లు ఎంత పెంచాలా.. ఈ నిర్ణయాల వెనుక దేశ ప్రయోజనం ఉందా? లేక ఒక కుటుంబ పోర్ట్‌ఫోలియో ఉందా? అన్న అనుమానం పుట్టిన క్షణం, ప్రజాస్వామ్య ప్రాణవాయువే ఆగిపోతుంది! అధికారానికీ, వ్యక్తిగత సంపదకూ మధ్య ఉక్కు గోడ నిర్మించడం ఇక ఎంపిక కాదు, తక్షణావసరం. సిట్టింగ్ అధ్యక్షుడితో సహా అన్నిస్థాయిల్లో వ్యక్తిగత షేర్ ట్రేడింగ్‌పై కఠిన నిషేధం, లేదా యజమానికే తన ఆస్తులు ఎక్కడున్నాయో తెలియని నిజమైన "బ్లైండ్ ట్రస్ట్".. ఈ రెండింటిలో ఒకటి తప్పనిసరి. లేకపోతే, "యుద్ధం ఎవరికి నష్టం, ఎవరికి లాభం?" అన్న ప్రశ్నకు సమాధానం శాశ్వతంగా సామాన్యుడికి వ్యతిరేకంగానే రాసిపెడతారు. చట్టం అనుమతించిన ప్రతిదీ గౌరవప్రదం కాదు; అత్యున్నత పీఠంపై కూర్చున్నవారు చట్టానికి కట్టుబడితే చాలదు, చట్టంకంటే ఎత్తైన నైతిక ప్రమాణానికి తలవంచాలి. ఆ తలవంపు లేనినాడు, పీఠం ఎంత ఎత్తైనా అది గౌరవ స్థానం కాదు -కేవలం ఒక మార్కెట్ టెర్మినల్!!

బాలల కోసం కథ



## చిట్టి చెట్టు నేర్పిన పాఠం

అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో 'చిన్నూ' ఉండేవాడు. "ఊరిలో అందరికంటే గొప్పవాణ్ణి కావాలి" అన్నది చిన్నూ కోరిక. ఒకరోజు చిన్నూ ఊరి తాతయ్య దగ్గరికి వెళ్ళాడు.

"తాతయ్యా, గొప్పవాడు అంటే ఎవరు? బోలెడంత డబ్బు ఉన్నవాడా?" అని అడిగాడు. తాతయ్య చిరునవ్వుతో, "నీకో కథ చెప్తాను, విను" అన్నాడు.

"ఒక అడవిలో రెండు చెట్లు ఉండేవి. ఒకటి 'అహంకారం', ఇంకోటి 'ప్రేమ'. అహంకారం చెట్టు పొడవుగా, అందంగా పెరిగింది. కానీ తన నీడను ఎవరికీ ఇచ్చేది కాదు. 'ఇవన్నీ నావి!' అని పక్షులను తరిమేసేది.

ప్రేమ చెట్టు మాత్రం వేరు. తన నీడను అందరికీ పంచేది. పక్షులకు గూడు ఇచ్చేది. అలసిన బాటసారులకు చల్లని నీడనిచ్చేది. ఆకలితో ఉన్నవారికి పండ్లనిచ్చేది. ఒకరోజు పెద్ద తుఫాను వచ్చింది. అహంకారం చెట్టును ఎవరూ ప్రేమించలేదు కాబట్టి, అది ఒంటరిగా విరిగిపోయింది. ఎవరూ ఏడవలేదు. కానీ ప్రేమ చెట్టు కోసం పక్షులు, బాటసారులు అందరూ కలిసి దాన్ని కాపాడారు. ఎందుకంటే అది అందరికీ సాయం చేసింది కదా!"

చిన్నూ కళ్ళు పెద్దవి చేసి, "అంటే గొప్పవాడు అంటే ఇతరులకు సాయం చేసేవాడా తాతయ్యా?" అని అడిగాడు.

తాతయ్య సంతోషంగా తల ఊపాడు. "శభాష్! చాలా సంవత్సరాల క్రితం 'లియో టాల్‌స్టాయ్' అనే గొప్ప తాత ఉండేవాడు. ఆయన ఎప్పుడూ 'మనం పుట్టింది మన పొట్ట నింపుకోవడానికి మాత్రమే కాదు, ఇతరులకు సాయం చేయడానికి కూడా' అనేవాడు."

"కానీ నేను చిన్నపిల్లాణ్ణి. నేనేం సాయం చేయగలను?" అని అడిగాడు చిన్నూ.

"సాయం చేయడానికి పెద్దవాడివి కావాల్సిన అవసరం లేదు. చిన్న చిన్న పనులే గొప్ప సాయాలు" అన్నాడు తాతయ్య.

ఆ రోజునుంచి చిన్నూ మారిపోయాడు.

స్నేహితుడు రాజు లెక్కలు చేయలేక ఏడుస్తుంటే, ఓపికగా నేర్పించాడు. పక్కింటి అవ్వ బరువైన సంచి మోయలేకపోతే, "అవ్వా, నేను మోస్తాను!" అని అందుకున్నాడు. చెట్టుమీద ఇరుక్కున్న పిల్లిని జాగ్రత్తగా కిందికి దించాడు.

ప్రతిసారీ ఎవరికైనా సాయం చేసినప్పుడు, చిన్నూ గుండెలో డబ్బుతో కొనలేని వెచ్చని ఆనందం నిండేది.

కొన్ని రోజుల్లోనే అద్భుతం జరిగింది. చిన్నూ ఎక్కడికి వెళ్లినా అందరూ ప్రేమగా పలకరించేవారు. "మన చిన్నూ వచ్చాడు!" అని పిల్లలు చుట్టూ చేరేవారు.

కథ ముగింపు

ఒకరోజు చిన్నూ మళ్ళీ తాతయ్య దగ్గరికి వెళ్ళాడు. "తాతయ్యా! ఇప్పుడు ఊరందరూ నన్ను ఇష్టపడుతున్నారు. నేను చేసిందల్లా చిన్న చిన్న సాయాలే!"

తాతయ్య నవ్వుతూ, "ఇదే నిజమైన గొప్పతనం చిన్నూ. నీవు 'ప్రేమ' చెట్టులా అందరికీ నీడనిచ్చావు. డబ్బు ఉన్నవాడు గొప్పవాడు కాదు, ఇతరుల ముఖాల్లో నవ్వు తీసుకొచ్చేవాడే నిజమైన గొప్పవాడు" అన్నాడు.

ఆ రాత్రి చిన్నూ అమ్మను కౌగిలించుకుని, "అమ్మా, గొప్పవాడు అంటే ఎక్కువ తీసుకునేవాడు కాదు, ఎక్కువ ఇచ్చేవాడు!" అన్నాడు.

పిల్లలూ, మీరు నేర్చుకోవాల్సింది:

రోజూ ఒక్క మంచి పని చేస్తే చాలు -స్నేహితుడికి సాయం చేయడం, బాధలో ఉన్నవారి మాట వినడం, తెలిసిన విషయాలు ఇతరులకు నేర్పించడం. ఎందుకంటే, ఇచ్చే చేయి ఎప్పుడూ తీసుకునే చేతికంటే ఎత్తుగా ఉంటుంది!

# ఆత్మనిర్భరతవైపు మరో అడుగు



ఒడిశాలోని చాందీపుర్ పరీక్షా కేంద్రం నుంచి 'సూర్యాస్త్ర' సుదూర రాకెట్ వ్యవస్థ విజయవంతంగా నింగికెగసిన ఘట్టం కేవలం ఒక ఆయుధ పరీక్షగా చూడలేం. ఇది భారత రక్షణ రంగంలో మౌనంగా జరుగుతున్న ఒక నిర్మాణాత్మక మార్పునకు ప్రతీక. ప్రైవేట్ రంగ సంస్థ అయిన నిబె లిమిటెడ్ తయారు చేసిన ఈ వ్యవస్థ 150నుంచి 300 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను రెండుమీటర్ల కచ్చితత్వంతో ఛేదించడం సాంకేతికపరంగా ఎంత విశేషమో, ఆ పని ఒక ప్రభుత్వ సంస్థ కాకుండా ప్రైవేట్ సంస్థ చేయడం వ్యూహాత్మకంగా అంతకన్నా విశేషం. భారత్ తన రక్షణ సామర్థ్యాన్ని ఏ దిశగా తీర్చిదిద్దుకుంటోందో ఈ ఒక్క ప్రయోగం స్పష్టంగా చాటుతోంది.

**దిగుమతి దేశం నుంచి తయారీ దేశంగా**

దశాబ్దాల పాటు భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ దిగుమతి దేశాల్లో ఒకటిగా కొనసాగింది. యుద్ధ విమానాలు, జలాంతర్గాములు, క్షిపణి వ్యవస్థలు -ఇలా చాలా కీలక ఆయుధాల కోసం రష్యా, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, అమెరికావంటి దేశాలపై ఆధారపడాల్సి వచ్చేది. ఈ ఆధారపడటం కేవలం ఆర్థిక భారం మాత్రమే కాదు; సంక్షోభ సమయంలో విడిభాగాల సరఫరా, నిర్వహణ, ఆధునీకరణవంటి అంశాల్లో మన నిర్ణయాధికారాన్ని పరిమితం చేసే వ్యూహాత్మక బలహీనత కూడా. ఏదైనా యుద్ధ పరిస్థితి ఏర్పడినప్పుడు సరఫరా దేశం రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గితే మన రక్షణ యంత్రాంగమే స్తంభించిపోయే ప్రమాదం ఉంటుంది. ఈ నేపథ్యంలోనే 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం రక్షణరంగంలో ఒక మార్గదర్శక సూత్రంగా మారింది. స్వదేశీ తయారీని ప్రోత్సహించడం, ప్రైవేట్ సంస్థలను రక్షణ ఉత్పత్తిలో భాగస్వాములను చేయడం, పరిశోధన-అభివృద్ధికి పెద్దపీట వేయడం -ఈ మూడు అంశాలచుట్టూ గత కొన్నేళ్లుగా విధానపరమైన మార్పులు చోటుచేసుకున్నాయి. సూర్యాస్త్ర పరీక్ష ఈ విధానానికి లభించిన ఒక గట్టి ఫలితం.

**ప్రైవేట్ రంగం ప్రవేశం: ఒక నిశ్శబ్ద విప్లవం**

ఇంతకాలం రక్షణ ఉత్పత్తి అంటే ప్రభుత్వరంగ సంస్థలు, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలు, డీఆర్‌డీఓవంటి సంస్థల గుత్తాధిపత్యంగా ఉండేది. ఇప్పుడు ఆ చిత్రం మారుతోంది. నిబె లిమిటెడ్‌వంటి ప్రైవేట్ సంస్థ ఒక సుదూర గైడెడ్ రాకెట్ వ్యవస్థను అభివృద్ధి చేసి, పరీక్షించి, దానిని భారత సైన్యం కొనుగోలుకు సిద్ధపడే స్థాయికి తీసుకురావడం ముఖ్యమైన మలుపు. ఇది పోటీని పెంచి, ఆవిష్కరణలను వేగవంతం చేసి, ఖర్చు తగ్గిస్తుంది.

ప్రైవేట్‌రంగ ప్రవేశంతో మరో ప్రయోజనం కూడా ఉంది. ప్రభుత్వ సంస్థల్లో ప్రాజెక్టులు అనేక సంవత్సరాలపాటు ఆలస్యమవడం సాధారణం. ప్రైవేట్ సంస్థల్లో సమయపాలన, నాణ్యత నియంత్రణ, వేగవంతమైన నిర్ణయ ప్రక్రియవంటి అంశాలు మెరుగ్గా ఉంటాయి. అదే సమయంలో, ఈ సంస్థలు భవిష్యత్తులో ఎగుమతి మార్కెట్‌లోకి ప్రవేశించడం ద్వారా భారతదేశాన్ని ఆయుధ ఎగుమతి దేశంగా మార్చే అవకాశమూ ఉంది. ఇప్పటికే బ్రహ్మోస్ క్షిపణి ఎగుమతుల ద్వారా ఈ దిశగా చిన్న ప్రారంభం జరిగింది.

**సూర్యాస్త్రవంటి వ్యవస్థల వ్యూహాత్మక ప్రాముఖ్యత**

ఆధునిక యుద్ధంలో కచ్చితత్వమే విజయానికి కీలకం. శత్రు భూభాగంలోని కమాండ్ సెంటర్లు, రాడార్ కేంద్రాలు, లాజిస్టిక్స్ హబ్‌లను దూరంనుంచే కచ్చితంగా ధ్వంసం చేయగల సామర్థ్యం ఆధునిక సైన్యానికి అత్యవసరం. సంప్రదాయ ఫిరంగి గుండ్లు విస్తృతమైన ప్రాంతంపై ప్రభావం చూపితే, సూర్యాస్త్రవంటి గైడెడ్ రాకెట్లు నిర్దిష్ట లక్ష్యాన్ని మాత్రమే ఛేదిస్తాయి. దీనివల్ల పౌరనష్టం తగ్గుతుంది, మందుగుండు వ్యయం తగ్గుతుంది, వ్యూహాత్మక ప్రయోజనం పెరుగుతుంది.

భారతదేశం రెండు సరిహద్దుల్లో సవాళ్లను ఎదుర్కొంటోంది. ఒకవైపు పశ్చిమ సరిహద్దు, మరోవైపు ఉత్తర సరిహద్దు. ఈ రెండుచోట్లా శత్రు భూభాగంలోని కీలక స్థావరాలను దూరం నుంచే నిర్వీర్యం చేయగల సామర్థ్యం వ్యూహాత్మకంగా అమూల్యమైనది. సూర్యాస్త్రవంటి దేశీయ వ్యవస్థలు ఈ అవసరాన్ని తీర్చడంతోపాటు, విదేశీ సరఫరాదారులపై ఆధారపడకుండా మన అమ్ములపొదిని నిరంతరం సుసంపన్నం చేసుకునే స్వేచ్ఛను కల్పిస్తాయి.

**ప్రపంచ యుద్ధ వాతావరణం నుంచి నేర్చుకున్న పాఠాలు**


ప్రస్తుత ప్రపంచ పరిస్థితులు ప్రతి దేశాన్నీ తన రక్షణ సన్నద్ధతను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో జరిగిన అంతర్జాతీయ ఘర్షణలు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పాయి. యుద్ధం దీర్ఘకాలం కొనసాగినప్పుడు, ఆయుధాలు, మందుగుండు సామగ్రిని నిరంతరం ఉత్పత్తి చేసుకోగల దేశీయ సామర్థ్యం ఉన్న దేశమే చివరికి నిలబడుతుంది. విదేశీ సరఫరాలపై ఆధారపడే దేశాలు సంక్షోభ సమయంలో తీవ్ర ఇబ్బందులు పడతాయి. డ్రోన్‌లు, కచ్చితమైన దాడి ఆయుధాలు, ఎలక్ట్రానిక్ యుద్ధ వ్యవస్థలు ఆధునిక యుద్ధ స్వరూపాన్ని పూర్తిగా మార్చేశాయి. ఖరీదైన భారీ ఆయుధాలకంటే, చౌకగా పెద్ద సంఖ్యలో ఉత్పత్తి చేయగల కచ్చితమైన దాడి వ్యవస్థలు ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. ఈ మారుతున్న వాస్తవికతను భారత్ గుర్తించడం, దానికి తగినట్లుగా దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం దూరదృష్టితో కూడిన చర్య.

ఈ పురోగతిని స్వాగతిస్తూనే, మనం ఆత్మసంతృప్తికి లోనుకాకూడదు. ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి ఉంది. యుద్ధ విమానాల ఇంజన్లు, అత్యాధునిక సెన్సర్లు, కొన్ని కీలక సెమీకండక్టర్ భాగాల కోసం భారత్ ఇప్పటికీ విదేశాలపై ఆధారపడుతోంది. పరిశోధన-అభివృద్ధికి మన బడ్జెట్ కేటాయింపులు అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే ఇంకా తక్కువే. ప్రైవేట్ సంస్థలకు దీర్ఘకాలిక ఆర్డర్లు, స్థిరమైన విధానపరమైన మద్దతు లేకపోతే వారి పెట్టుబడులు, ఉత్సాహం నిలబడవు. అదే సమయంలో, నాణ్యత నియంత్రణ, పరీక్షా ప్రమాణాలు, దేశీయ ఉత్పత్తుల విశ్వసనీయతవంటి అంశాల్లో రాజీపడకూడదు. ఒక్క పరీక్ష విజయవంతమైనంత మాత్రాన ఆ వ్యవస్థ యుద్ధక్షేత్రంలో పూర్తిగా నమ్మదగినదని నిర్ధారించలేం. పునరావృత పరీక్షలు, వాస్తవ పరిస్థితుల్లో ధ్రువీకరణ తర్వాతే ఈ వ్యవస్థలను పూర్తిస్థాయిలో మోహరించాలి.

**భవిష్యత్ దిశ**

భారత్ ముందున్న కర్తవ్యం స్పష్టం. స్వదేశీ ఆవిష్కరణలను ప్రోత్సహించడం, ప్రైవేట్- ప్రభుత్వ భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, పరిశోధనకు తగిన నిధులు కేటాయించడం, దేశీయ ఉత్పత్తులకు మార్కెట్ హామీ ఇవ్వడం -ఈ చర్యల ద్వారా రక్షణ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగాలి. సూర్యాస్త్ర వంటి విజయాలు ఈ ప్రయాణంలో మైలురాళ్లు మాత్రమే; గమ్యం ఇంకా దూరంలోనే ఉంది.

ఒక బలమైన దేశం యుద్ధాన్ని కోరుకోదు. కానీ యుద్ధానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఆ సన్నద్ధత విదేశీ సరఫరాదారుల దయపై ఆధారపడకుండా, మన సొంత కర్మాగారాలు, మన సొంత శాస్త్రవేత్తలు, మన సొంత ఇంజనీర్ల చేతుల్లో ఉన్నప్పుడే అది నిజమైన బలం. సూర్యాస్త్ర నింగికెగసిన ఆ క్షణం -భారత్ తన భద్రతా భవిష్యత్తును తన చేతుల్లోకి తీసుకుంటున్న సంకేతం. ఈ స్ఫూర్తి కొనసాగితే, రాబోయే దశాబ్దంలో భారతదేశం ఆయుధ దిగుమతి దేశం నుంచి ఆయుధ ఎగుమతి శక్తిగా రూపాంతరం చెందడం ఖాయం. ■



మనసులో ఒక ఆలోచన మెరిసింది. "అది పని చేయదు" అని దాన్ని పక్కన పెట్టావు. మళ్ళీ మెరిసింది.. మళ్ళీ పక్కన పెట్టావు. కానీ నీకు తెలుసా.. ప్రపంచాన్ని మార్చిన ప్రతి ఆవిష్కరణా ఒకప్పుడు అలా పక్కన పెట్టబడిన ఆలోచనే. అది చేత్తో పట్టుకున్నవాడే చరిత్ర రాశాడు.

కొత్త ఆలోచనలకు తలుపులు తెరుస్తూనే ఉండాలి. సాంప్రదాయాన్ని దాటి చూస్తూనే ఉండాలి. వేరే కోణంలో సమస్యలను అర్థం చేసుకుంటూనే ఉండాలి. ఇవన్నీ ఒకెత్తు.. ఆలోచనను రూపుదిద్దడం మరోఎత్తు. ఎంత ఊహించినా.. ఎంత కలలు కన్నా.. సృష్టించడానికి పూనుకోనంతవరకూ అది కేవలం ఊహే. కలంపట్టిన.. చేయి కదిలించిన క్షణమే కళ జీవం పోసుకుంటుంది.

-మహాదేవ


వింతల్లో వింతలు

## ఆకాశంలో 'బొమ్మ' విమానం!




రిమోట్ చేతిలో పట్టుకుని ఎగరేసే విమానం బుల్లిదిగా ఉంటుందనుకుంటే పొరపాటే! యూట్యూబర్ రామీ ఆర్‌సీ తయారు చేసిన ఎయిర్‌బస్ ఏ380 రిమోట్ విమానం ఏకంగా 800 పౌండ్ల బరువు, 32 అడుగుల (9.75 మీటర్ల) రెక్కల వెడల్పుతో ప్రపంచంలోనే అతిపెద్దదిగా నిలిచింది. చిన్న సెస్నా విమానమంత సైజున్న ఈ 'బొమ్మ' లోపల ఒక మనిషి హాయిగా పడుకోవచ్చు! అసలు ఫోమ్ బ్లాక్‌ను కోసి, ఫైబర్‌గ్లాస్, కార్బన్ ఫైబర్‌తో దిట్టంగా తయారుచేసిన ఈ భారీ పక్షికి కింద నాలుగు మోటార్లు. నిజమైన జెట్‌లాగే టేకాఫ్, ల్యాండింగ్ చేస్తూ అందరి నోళ్లు తెరిపించింది. బరువే అసలు పెద్ద తలనొప్పి అని, నెలల తరబడి కష్టపడి దాన్ని జయించానని రామీ చెప్పుకొచ్చాడు. మొత్తానికి బొమ్మ విమానం పెద్దదైతే, ఆశ్చర్యం అంతకన్నా పెద్దది!


# ‘పొరబాటున కూడా నా కలలోకి రావొద్దు’



“దేవుడు నాకొక గొప్ప వరమిచ్చాడు. ట్రిగ్గర్ నొక్కగానే మరిచిపోవడం. నిదరపోయినప్పుడు నా కల్లోకి నేను చంపినవాళ్ల ముఖాలు రావు, మిగిలివున్న శత్రువుల ముఖాలే కనపడతాయి. పొరపాటున కూడా నా కల్లోకి రావొద్దు....’ అంటున్నాడు ‘డ్రాగన్’ అవతారంలో ఎన్టీఆర్. డ్రాగన్ కథేమిటో తెలియాలంటే వచ్చే ఏడాది వరకూ ఎదురు చూడాల్సిందే. ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రమే ‘డ్రాగన్’. మైత్రీ మూవీ మేకర్స్, నందమూరి తారక రామారావు ఆర్ట్స్, టీ సిరీస్ ఫిల్మ్స్ సంస్థలు రూపొందిస్తున్నాయి. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, రవిశంకర్ యలమంచిలి, కొసరాజు హరికృష్ణ నిర్మాతలు. ఎన్టీఆర్ పుట్టినరోజుని పురస్కరించుకుని మంగళవారం రాత్రి గ్లింప్స్‌ని విడుదల చేస్తూ పేరుని అధికారికంగా ప్రకటించింది చిత్రబృందం. “బ్రిటిష్ వాళ్లు భారతదేశానికి కాటన్, స్టీల్, స్పైసెస్ కోసం వచ్చారు. కానీ 250 ఏళ్లు వాళ్లు ఇక్కడే ఉండిపోవడానికి కారణం... ఒక మొక్క. ప్రపంచంలోనే అత్యంత వ్యసనకారక పదార్థమైన హెరాయిన్‌ని తయారు చేసే ఆ మొక్క... ఓపియమ్ పాపి’ అంటూ మొదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని రేకెత్తించింది. ఈ మొక్క హెరాయిన్ కంటే ఎక్కువ విలన్స్‌నే తయారు చేసిందని, విలన్ల కథే అని టీజర్ చాటుతోంది. ఎన్టీఆర్ డ్రాగన్‌గా రక్తపాతం సృష్టించే శక్తిమంతమైన పాత్రలో కనిపించారు. విజువల్స్ ప్రత్యేకమైన కథా ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాయి. ‘కె.జి.ఎఫ్’ చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని అలరించిన దర్శకుడు ప్రశాంత్‌నీల్ ‘సలార్’ తర్వాత తెరకెక్కిస్తున్న సినిమా ఇది. ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 11న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సంగీతం రవి బస్రూర్.

# హాట్ స్టార్!

నభానటేష్



# డెడ్ హైప్‌లో దృశ్యం-3

ఇండియన్ సినిమా నుంచి వచ్చిన పలు బెస్ట్ క్రైమ్ అండ్ సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రాల్లో మలయాళ సినిమా డెలివర్ చేసిన క్రేజీ హిట్ ‘దృశ్యం’ ఒకటి. మోహన్‌లాల్ హీరోగా జీతూ జోసెఫ్ కలయికలో చేసిన ఈ సినిమా రెండు భాగాలూ కూడా సాలిడ్ హిట్ అయ్యి పర్ఫెక్ట్ సీక్వెల్‌తో కూడిన ఫ్రాంచైజ్‌గా నిలిచింది. అయితే ఇప్పుడు పార్ట్-3ని మాత్రం మేకర్స్ ఒరిజినల్‌నే పాన్ ఇండియా లెవెల్లో తీసుకొస్తున్నారు. అయితే మల యాళంలో సినిమా హైప్ ఓకే. కానీ మిగతా వర్షన్‌లలో మాత్రం పూర్తిగా డెడ్ అనే చెప్పక తప్పదు. రేపే సినిమా రిలీజ్ అయినప్పటికీ.. మినిమమ్ బుకింగ్స్ సినిమాకి కనిపించడం లేదు. మెయిన్‌గా మన తెలుగులో ఈ సినిమాని వెంకీ మామకే వదిలేయాల్సింది. ఒరిజినల్‌నే ఇపుడు డబ్బింగ్ చేసి తీసుకొస్తుండగా దీనికి మినిమమ్ ప్రమోషన్స్ కూడా చేయకుండా పక్కన పెట్టేసారు. బహుశా దృశ్యం సిరీస్ కదా తెలుగు ఆడియెన్స్ చూసేస్తారు అనుకున్నారో ఏమో కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తుంటే మన వాళ్లు కనీసం ఈ సినిమా ఒకటి ఉందని పట్టించుకోవడం లేదు. సో ఈ సినిమా ఇప్పుడు ఫుల్ ఫామ్‌లో ఉన్న వెంకీ మామకే వదిలేసి ఉంటే సాలిడ్ ఓపెనింగ్స్ దక్కి ఉండేవి. మరి ఈ ఛాన్స్‌ని వారు మిస్ చేసుకున్నారు. ఇక రిలీజ్ అయ్యాక ఏమన్నా లెక్కలు మారుతాయేమో చూడాలి మరి.







# సునీల్ నారంగ్ రాజీనామా

కొన్ని రోజులుగా పర్సంటేజీ విషయంలో నెలకొన్న వివాదం ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్ష పదవికి నేడు సునీల్ నారంగ్ రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. ఈమేరకు తన రిజైన్ లెటర్‌ను ఈమెయిల్ ద్వారా ఫిల్మ్ ఛాంబర్‌కు పంపారు. “కొందరు కార్యవర్గ సభ్యులను సంతోషపెట్టడానికి నిర్ణయాలు తీసుకోవాలని మాపై ఒత్తిడి తెస్తున్నారు. నేను ఇకపై అలా చేయలేను. అలాగే, నా ఆరోగ్యం కూడా దెబ్బతింటోంది. ఛాంబర్ ఎప్పుడూ ఒకేరకమైన నిర్ణయాలతో నడవాలి. ప్రస్తుతం అలా జరగడం లేదు. నా రాజీనామాకు ఇది కూడా ఒక కారణమే” అని ఫిల్మ్ ఛాంబర్‌కు రాసిన లేఖలో సునీల్ నారంగ్ పేర్కొన్నారు. సినిమా ప్రదర్శనల విషయంలో సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాలు, సినీ నిర్మాతల మధ్య ఇటీవల వివాదం నెలకొంది. ఈ సమస్య పరిష్కారం కోసం చలనచిత్ర వాణిజ్యమండలి ఇరువర్గాలకు నచ్చజెప్పి నిర్మాతలు, పంపిణీదారులు, ప్రదర్శనకారులతో ఓ ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది.



# రామ్‌తో శ్రీనిధి జతకడుతుందా?

టాలీవుడ్ యంగ్ అండ్ ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని తన అభిమానులకు ఒక ఊహించని సర్‌ప్రైజ్ ఇచ్చాడు. తన కొత్త చిత్రానికి ఆయనే స్వయంగా దర్శకత్వం వహించనున్నట్టు ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. ఈ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే కూడా రామ్ స్వయంగా అందించడం విశేషం. సరికొత్త కాన్సెప్ట్‌తో తెరకెక్కనున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ త్వరలోనే షూటింగ్ ప్రారంభించుకోవడానికి సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా ‘కేజీయఫ్’ ఫేమ్, కన్నడ బ్యూటీ శ్రీనిధి శెట్టిని ఎంపిక చేసేందుకు చిత్రబృందం చర్చలు జరుపుతున్నట్టు ఫిల్మ్‌నగర్ సమాచారం. ప్రస్తుతం ఆమె వెంకటేష్, త్రివిక్రమ్ కలయికలో వస్తున్న ‘ఆదర్శ కుటుంబం’ సినిమాలో నటిస్తోంది. నాని సరసన ‘హిట్-3’ మూవీలో నటించిన శ్రీనిధి మంచి సక్సెస్ అందుకుంది. రామ్ సరసన శ్రీనిధి నటిస్తే ఈ సినిమాకు మరింత క్రేజ్ రావడం ఖాయమని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. స్టైలిష్ సైకలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందనున్న చిత్రాన్ని కృష్ణ పోతినేని ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను 2026 డిసెంబర్ నాటికి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.







# బాలయ్య ప్రాజెక్టులో మనోజ్

అగ్ర కథానాయకుడు బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. ‘ఎన్బీకె111’గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా టీమ్ అప్డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రంలో నటుడు మంచు మనోజ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్టు ప్రకటించింది. ఈ విషయాన్ని తెలుపుతూ దర్శకుడు పోస్ట్ పెట్టారు. ‘మీ పాత్ర ఎంత పవర్ఫుల్‌గా ఉంటుందో ప్రేక్షకులు చూడడం కోసం వేచి చూస్తున్నా’ అని రాశారు. ఇందులో ఆయన విలన్‌గా నటిస్తున్నట్టు తెలుస్తోంది. గతంతో బాలకృష్ణ, మంచు మనోజ్ ఇద్దరూ ‘ఊ.. కొడతారా ఉలిక్కిపడతారా’ సినిమాలో నటించారు. ఇది రెండో చిత్రం కావడం విశేషం. హిస్టారికల్ మూవీగా తెరకెక్కుతోన్న ‘ఎన్బీకె111’లో బాలకృష్ణ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. ‘వీర సింహారెడ్డి’ విజయం తర్వాత గోపిచంద్ మలినేని - బాలయ్యనుంచి వస్తున్న రెండో చిత్రమిది. ఇందులో బాలకృష్ణకు జోడీగా నయనతార నటిస్తున్నారు. ఇది వీరి నాలుగో సినిమా కావడం విశేషం. గతంలో వీరిద్దరూ నటించిన ‘సింహా’, ‘జైసింహా’, ‘శ్రీరామరాజ్యం’ సినిమాలు హిట్‌గా నిలిచి అలరించాయి. ఇక ఈ చిత్రానికి సంగీతం తమన్ అందిస్తున్నారు. బాలయ్య కోసం తమన్ వర్క్ చేస్తోన్న ఆరో ప్రాజెక్ట్ ఇది. వీరిద్దరి కాంబోలో గతంలో వచ్చిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు మనోజ్ కూడా భాగం కావడంతో అంచనాలు పెరిగాయి.

# ఆర్థిక స్వేచ్ఛ తరువాతే పెళ్లి..

మహిళలు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే.. మీరు ఏం చేస్తారు, మీరు ఎవరనేదే ముఖ్యం అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగనా. వివాహిత మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆమె తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇందులో యువతులు వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు ఆర్థిక స్వాతంత్ర్యంతోపాటు తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. “రోజూ పెళ్లి అయిన యువతుల గురించి ఎన్నో విషాద వార్తలు వస్తున్నాయి. చదువుకున్న యువతులలో చాలామంది ఆ విషాదం ఎదురుకాకముందే.. తమని ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితుల నుంచి బయటపడేయమని తమ తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, భారతీయ సమాజం కూతుళ్లకు పెళ్లయ్యాక వారిని వదిలేస్తుంది.

మీ జీవితంలో మరెవరోకన్నా మీ కెరీరే మీకు ముఖ్యం. మీరు ఆర్థికంగా స్వేచ్ఛగా ఉన్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి, మీ జీవితానికి మీరే హీరో అయి ఉండండి. మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ రారు. మీరు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే మీరు ఏం చేస్తున్నారు, ఎవరు అనేదే ముఖ్యం. మీకు కావాల్సిన జీవితాన్ని మీరే నిర్మించుకోండి. ఎవరి మాటా వినకండి” అని కంగనా ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఉత్తరాదిలో ఇటీవల జరిగిన వివాహిత మహిళల ఆత్మహత్యల నేపథ్యంలో కంగనా ఈ పోస్ట్ పెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. కంగనా నటిస్తున్న ‘భారత భాగ్య విధాత’ వచ్చే నెల 12న విడుదల కానుంది.



Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com